
సాక్షి ఒడిశా

ఆదివారం । 10 । మార్చి । 2024

I



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,92,079
బంగారం 350 మిల్లీ గ్రాములు
వెండి 5 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రత్న భాండాగారం కమిటీ తొలి సమావేశం

పూరీ శ్రీజగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారంలో ఉన్నటువంటి ఖజానా జాబితా తయారు చేసేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన 12 మంది సభ్యుల కమిటీ శనివారం తొలిసారి సమావేశమైంది.

- IIలో



అంకులిలో ట్రక్ బోల్తా

బరంపురం నగర శివారులోని అంకులి బైపాస్‌లో ట్రక్ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైన ఘటన చోటుచేసుకుంది.

- IIలో

న్యూస్‌రీల్

కుట్టు మిషన్లు పంపిణీ



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తరుపున 75 మంది మహిళలకు కుట్టు మిషన్లు శనివారం అందజేశారు. రూరల్ ఎంప్లాయిమెంట్ ఇన్‌స్టిట్యూట్ రూమ్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రత్నకర్ సాహు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. మహిళలను గౌరవించడం మన బాధ్యత అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దేవదత్ మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి కల్పించడం కోసమే మిషన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ బాలజీ పట్నాయక్, డీపీఎం శల్వి మోహన్ బర్హా తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



యువకుడి మృతదేహం

రాయగడ: సదరు పోలీసుస్టేషన్ పరిధి శంకేసు అడవుల్లో చెట్టుకు వేలాడుతున్న గుర్తు తెలియని ఒక యువకుడి మృత దేహాన్ని పోలీసులు శనివారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. నీలిరంగు చారల చొక్కా వేసుకున్న యువకుడి మృతదేహాన్ని అటువైపుగా వెళ్తున్న కొందరు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఐఐసీ కమలాకాంత్ కుహరో, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అయితే మృత దేహం పూర్తిగా గుర్తుపట్టని విధంగా మారిపోవడంతో చాలారోజుల క్రితం ఈ సంఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఇది హత్యా, లేక ఆత్మహత్యా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయితో ఒకరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోలీసుస్టేషన్ పరిధిలో రహదారిపై శనివారం మధ్యాహ్నం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక యువకుడు అతివేగంగా బైక్‌పై రావడం గమనించారు. దీంతో అతడిని ఆపి బైక్ వెనుక ఉన్నటువంటి బస్తాను తనిఖీ చేయగా, గంజాయి బయటపడింది. వెంటనే యువకుడిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌ను తరలించారు. విచారించగా కలిమెల సమితి ఎంవీ 66 గ్రామానికి చెందిన సమీర్ విశ్వస్ (20)గా పేర్కొన్నాడు. మోటూ మీదుగా ఆంధ్రప్రదేశ్ తరలిస్తున్నట్లు తెలియజేశాడు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

జాగరణలో ఉద్రిక్త పరిస్థితి



ఆలయ ప్రధాన గేటు ముందు బైఠాయించిన భక్తులు

జయపురం: ఒక పోలీసు అధికారి ఆదేశాలు కారణంగా శుక్రవారం రాత్రి ప్రసిద్ధ గుప్తేశ్వర్ శివక్షేత్రంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మహాశివరాత్రి సన్నాహక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తుంగలోతొక్కి భక్తులు కొబ్బరికాయలు కొట్టవద్దని పోలీసు అధికారి ఆదేశించాడు. దీంతో ఆ నిర్ణయాన్ని తప్పుబట్టిన స్వచ్ఛంద కార్యకర్తలు, పూజారులు తమ విధులు, పూజలు విడిచి వెళ్లిపోయారు. ఫలితంగా పరమేశ్వరుడికి పూజలు ఆగిపోయాయి. భక్తులు ఆలయ ప్రధాన గేటు ముందు దీపాలతో బైఠాయించారు. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ వచ్చి, పోలీసు అధికారి తరపున పూజారులు, స్వచ్ఛంద కార్యకర్తలు, భక్తులకు క్షమాపణ చెప్పడంతో అర్ధరాత్రి తర్వాత పూజలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఫిబ్రవరి 17వ తేదీన నిర్వహించిన సన్నాహక సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. అయితే ఆరోజు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి తప్ప మరే పోలీసు అధికారి సమావేశంలో పాల్గొనలేదు. అందువలన అప్పుడు తీసుకున్న నిర్ణయాలు పోలీసు ఉన్నతాధికారికి తెలియకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. అయితే ఎట్టకేలకు సబ్ కలెక్టర్ కలగజేసుకోవడంతో పరిస్థితులు చక్కబడ్డాయి.

వ్యూహాత్మక మౌనం..!

- ఢిల్లీ నుంచి వచ్చిన బీజేడీ నాయకులు
- పొత్తుపై నోరువిప్పని వైనం
- ఒంటరిగానే పోటీ చేస్తామంటున్న బీజేపీ రాష్ట్ర నాయకులు



భువనేశ్వర్: రాష్ట్ర రాజకీయాల్లో బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ మధ్య పొత్తు ఎటువైపు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. పొత్తుపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు తమ వైఖరి స్పష్టం చేసినా, బిజూ జనతా దళ్ మాత్రం పెదవి కదపకుండా మౌనం పాటిస్తోంది. కేంద్ర నాయకుల పరిధిలో రాష్ట్రంలో బీజేడీతో పొత్తుపై ఎటువంటి ప్రస్తావన లేదు. బీజేపీ రాష్ట్ర నాయకులు మాత్రం త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఉభయ లోక్‌సభ, శాసనసభకు ఒంటరిగా పోటీ చేస్తామని చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలు సాధిస్తామని ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొని ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెగేసి చెప్పారు.

గుంభనంగా బీజేడీ

అయితే ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన బిజూ జనతా దళ్ నాయకులు వి.కార్తికేయ పాండియన్, ప్రణబ్ ప్రకాష్ దాస్‌లు మాత్రం ఇంతవరకు పొత్తు విషయమై నోరు మెదపకుండా శంఖ భవన్‌లో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీజేపీతో పొత్తు పురస్కరించుకుని వీరివురు ఢిల్లీలో అగ్రశ్రేణి నాయకులతో భేటీ అయ్యి, లెక్కలు తేల్చుకునేందుకు హుటాహుటిన బయల్దేరి తిరిగి వచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర నాయకుల సమావేశానికి ముందు రాష్ట్రంలో బీజేడీ, బీజేపీ నాయకులు పొత్తు ప్రసక్తే లేదు, ఒంటరిగానే పోటీ చేస్తామని ఎవరి తరహాలో వారు ప్రకటించారు. ఢిల్లీ సమావేశం తర్వాత బీజేపీ పాత వైఖరినే ప్రదర్శిస్తున్నా, బీజేడీ మాత్రం మౌనం వహించి పొత్తుకు లోపాయికారీ ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తుందనే ఊహాగానాలను ప్రేరేపిస్తోంది. ఆ పార్టీ ప్రముఖులు పొత్తుపై సానుకూల వైఖరి ప్రదర్శించడం దీనికి కారణంగా చెప్పుకుంటున్నారు.

అసంతృప్తి ఉండదు: నృసింహ చరణ్ సాహు




బీజేడీ, బీజేపీ మధ్య పొత్తు కుదిరితే బిజూ జనతా దళ్ వర్గంలో ఎటువంటి వైరి భావం, అసంతృప్తి సెగల ప్రభావం ఉండబోదని ఆ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ నృసింహ చరణ్ సాహు తెలిపారు. ఒకవేళ పొత్తు కుదరకున్నా బీజేడీ 110 సీట్లకు పైగా గెలుకుని రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని దీమా వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తు గురించి వింటున్నాం. అయితే ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ తుది నిర్ణయం తీసుకుంటారు. ఆయన నిర్ణయానికి పార్టీ వర్గీయులంతా కట్టుబడి ఉంటారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేడీ సంకీర్ణానికి అంగీకరించింది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్రంతో మైత్రి సంబంధాలు వారధిగా నిలుస్తాయి. రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందనే దృక్పథంతో బీజేడీ పొత్తు కోసం అంగీకరించిందని వివరించారు. బీజేపీతో పొత్తు కుదిరతే బీజేడీలో కొందరికి టిక్కెట్లు రాకపోవచ్చు కానీ ఎవరూ తిరుగుబాటు చేయరని గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తు కుదిరితే బీజేడీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే విషయంపై ఆయన దాటవేశారు.

కొరాపుట్ నేతల్లో కలవరం

జయపురం: అవిభక్త కొరాపుట్ నేతల్లో బీజేడీ–బీజేపీ పొత్తు ఊహాగానాలు కలవరం పుట్టిస్తున్నాయి. 15 ఏళ్ల తర్వాత ఈ రెండు పార్టీలు మరలా జతకట్టి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తాయని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ రెండు పార్టీలు రానున్న ఎన్నికల్లో జతకడతాయని ముందుగానే పసికట్టిన కాంగ్రెస్ పార్టీ ఆ రెండు పార్టీలకు ఆహ్వాన పత్రికలు ముద్రించి పెళ్లి జరిపింది. అయితే ఈ రెండు పార్టీల కలయిక ఉభయ పార్టీల నేతల్లోనే కాకుండా కార్యకర్తల్లోనూ కలవరం రేపుతోంది. ఈ పొత్తు వద్దని పలువురు బీజేడీ వర్గాలు భావిస్తున్నా బయటకు చెప్పలేకపోతున్నారని సమాచారం. పొత్తులో భాగంగా అవిభక్త కొరాపుట్‌లో రెండు పార్లమెంట్ స్థానాలు బీజేపీకి కేటాయిస్తున్నట్లు వార్తలు రావడంతో బీజేడీ వర్గాల్లో తీవ్ర గుబులు పుడుతోంది. కొరాపుట్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ ఒక్కసారి కూడా విజయం సాధించలేదని, కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేదని గుర్తు చేస్తున్నారు. అటువంటి పార్టీకి రెండు స్థానాలు ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ స్థానంలో జిన్నా హికాక ఒకసారి, జయరాం పంగి ఒకసారి బీజేడీ అభ్యర్థులుగా విజయం సాధించారు. 2014లో బీజేడీ అభ్యర్థిగా విజయం సాధించిన జయరాం పంగి, 2019లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి కేవలం 19.29 శాతం ఓట్లు పొంది మూడో స్థానానికి పరిమితమయ్యారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్టుపై బరిలో దిగేందుకు ప్రయత్నిస్తున్న శివ శంకర ఉల్క 2014లో బీజేపీ టిక్కెట్టుపై పోటీ చేసి కేవలం 9.07 శాతం ఓట్లు మాత్రం పొంది మూడో స్థానంలో నిలిచారు. దీంతో ఎప్పుడూ మూడో స్థానంలో నిలిచే బీజేపీ టిక్కెట్టు కేటాయించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ స్థానాన్ని బీజేపీ కేటాయిస్తున్నారనే విషయాన్ని బీజేడీ టిక్కెట్టుపై ఆశావాహులు ఖండిస్తున్నారు. కాంగ్రెస్‌కు కంచుకోట అయినటువంటి ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా పరశురాం మరియు 1999, 2004 ఎన్నికల్లో విజయం సాధించారు. తర్వాత ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ విజయం సాధించలేదు సరికదా రెండో స్థానం కూడా సాధించలేదు. అటువంటి ఈ రెండు స్థానాలు బీజేపీకి కేటాయించాలనుకోవడంపై అసంతృప్తి చెందుతున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి.

గజపతిలో బీజేడీ నాయకుల ఆందోళన

పర్లాకిమిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ, బీజేపీ పొత్తు ఉంటుందనే సంకేతాలపై గజపతి జిల్లా బీజేడీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బీజేడీ సీనియర్ నాయకుడు తిరుపతి పాణిగ్రాహి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేడీ ఒంటరిగానే పోటీ చేస్తుందనే ఆశా భావం వ్యక్తం చేశారు. జిల్లాలోని పర్లాకిమిడి, మోహనా నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్, కో–ఆపరేటివ్ సొసైటీల్లో బీజేడీ పార్టీ ప్రతినిధులే అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న విషయం తెలియజేశారు. బీజేడీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



తిరుపతి పాణిగ్రాహి

ఒంటరి పోరాటంతో గెలుస్తాం: విజయ్‌పాల్

సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోరాడుతాం. ఉభయ శాసన సభ, లోక్ సభ ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలుస్తామని ఒడిశా బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్ తెలిపారు. ఇప్పటివరకు పొత్తుపై ఎలాంటి చర్చ జరగలేదన్నారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల నుంచి పోటీ చేసేందుకు మాత్రం బీజేపీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. 80కి పైగా శాసన సభ సీట్లు, 16కి పైగా లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలుపు తథ్యమన్నారు. తమ పార్టీ గెలిచి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఇద్దరు బీజేడీ నేతల ఢిల్లీ పర్యటనలో తనను ఎవరూ కలవలేదని విజయ్‌పాల్ సింగ్ తోమర్ తెలిపారు.

అత్త, మరదలిపై అల్లుడి దాడి



గాయాలతో బాసంతి జొడియా



గాయాలతో అత్త పార్వతి జొడియా

రాయగడ: చెడు తిరుగులు తిరుగుతున్నావని వారించిన అత్త, మరదలిపై ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రగాయాలకు గురిచేసిన అల్లుడి ఉదంతం వెలుగుచూసింది. సదరు పోలీసుస్టేషన్ పరిధి చెక్కగుడ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి నిందితుడు ఢిల్లేశ్వర్ బలస(32)ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడిలో గాయపడిన అత్త పార్వతి జొడియా (48), మరదలు బాసంతి జొడియా (24)లను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ తరలించారు.

పోలీసుల వివరాల మేరకు...

చెక్కగుడలో నివాసముంటున్న బాసంతి జొడియాకు ఇద్దరు కూతుళ్లు. వీరిలో పెద్ద కూతురు భారతి (28)ని అదే ప్రాంతానికి చెందిన ఢిల్లేశ్వర్‌కు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఇద్దరు అన్యోన్యంగా చెక్కాగుడలోనే వేరే ఇంటిలో నివసిస్తుండేవారు. అయితే కొన్ని నెలలుగా ఢిల్లీశ్వర్ ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి తన భార్య భారతిని వేదిస్తున్నాడు. దీంతో విసుగెత్తిన ఆమె విషయాన్ని తన తల్లి పార్వతికి తెలియజేసింది. ఈ క్రమంలో గ్రామంలోని పెద్దలకు ఈ విషయం తెలియజేయగా భార్యభర్తలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో తల్లితో భారతి ఉండేది. శుక్రవారం ఉదయం తన చెల్లి బాసంతితో కలిసి భారతి విడాకుల కోసం ఒక న్యాయవాదిని కలిసింది. అనంతరం ఇంటికి తిరిగి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఢిల్లేశ్వర్ రాత్రి 10 గంటల సమయంలో తప్పతాగి ఒక రాడ్డు సాయంతో మరదలు బాసంతిపై దాడి చేశాడు. అదేవిధంగా అడ్డుపడిన అత్త పార్వతీపై కూడా దాడి చేయడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో భారతి కేకలు వేయగా స్థానికులు వచ్చి గాయపడినవారిని ఆస్పత్రికి తరలించారు. భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూట్ మారింది..!

- పూరీ నుంచి విశాఖపట్నం మధ్య వందేభారత్

భువనేశ్వర్: పూరీ, విశాఖపట్నం మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈనెల 12న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పచ్చజెండా ఊపి 20841/20842 కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇది మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుగా నిలుస్తుంది. లోగడ ఈ రైలుని భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం మధ్య నడిపించనున్నట్లు ప్రతిపాదించారు. శనివారం మినహా వారానికి 6 రోజులు నిత్యం ఉదయం పూరీ నుంచి బయల్దేరి మధ్యాహ్నానికి విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం పూరీకి బయల్దేరి రాత్రికి చేరుకుంటుంది. పూరీ, విశాఖపట్నం 20841/20842 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఖుర్దా రోడ్, బరంపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం స్టేషన్లలో ఆగుతుంది. రాష్ట్రంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పూరీ నుంచి బయల్దేరడం విశేషం. ప్రస్తుతం పూరీ నుంచి రౌర్కెలా, హౌరాలను కలుపుతూ రాష్ట్రంలో 2 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ 2 రైళ్ల భోగీలు తెలుపు, నీలం రంగులో ఉండగా కొత్తగా ప్రారంభం కానున్న మూడో రైలు రంగు కుంకుమ–బూడిద రంగులో ఉంటుందని సమాచారం.



సిద్ధమైన కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

భిన్నాభిప్రాయాలు

కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుని పూరీ నుంచి నడిపించి భువనేశ్వర్ మినహాయించడంపై పలు వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రైలు రాకపోకల వేళలపై సైతం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. పూరీ నుంచి రాత్రి బయల్దేరి ఉదయం పూట విశాఖపట్నం చేరేవిధంగా రాకపోకల వేళలను సవరించాలని ప్రతిపాదిస్తున్నారు. ఇలా అయితే పూరీ చేరి శ్రీ జగన్నాథుని దర్శించుకుని వెనుదిరిగేందుకు వీలుగా ఉంటుందంటున్నారు. ఈ సర్దుబాటుతో పాటు భువనేశ్వర్ మీదుగా పూరీకి నడిపించడంతో అధిక ప్రయాణికులు లబ్ధి పొందుతారని పేర్కొంటున్నారు.

వందే భారత్ రాకపోకల వివరాలు		
20841	పూరీ-విశాఖపట్నం	
రాక	పోక	స్టేషన్
--	05.15	పూరీ
05.57	06.07	ఖుర్దారోడ్
07.40	07.42	బరంపురం
08.48	08.50	పలాస
09.33	09.35	శ్రీకాకుళం రోడ్
10.18	10.20	విజయనగరం
11.30	--	విశాఖపట్నం
20842	విశాఖపట్నం-పూరీ	
రాక	పోక	స్టేషన్
--	15.40	విశాఖపట్నం
16.30	16.32	విజయనగరం
17.28	17.30	శ్రీకాకుళం రోడ్
18.20	18.22	పలాస
19.00	19.02	బరంపురం
20.55	21.05	ఖుర్దారోడ్

మో బస్సు సేవలు ప్రారంభం



వర్చువల్‌గా సేవలు ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

బరంపురం: నగర శివారులోని హల్దియాపద్ బస్టాండ్ నుంచి మో బస్సు సేవలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటల సమయంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బస్సు సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, గంజాం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, డిప్యూటీ మేయర్ వివేక్ రెడ్డి, గంజాం జిల్లా బీజేడీ అధ్యక్షుడు డా.రమేష్ చంద్రచావ్ పట్నాయక్, నగర కమిషనర్ భవానీ శంఖర్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా



పచ్చ జెండాలు ఊపుతున్న ఎంపీ శేఖర్ సాహు, ఎంఎల్ఏ విక్రమ్ తదితరులు




సేవలకు సిద్ధమైన కొత్త బస్సులు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

క్లుప్తంగా

రత్న భాండాగారం కమిటీ తొలి సమావేశం


జగన్నాథుని దర్శనానికి వెళ్తున్న జస్టిస్ అరిజిత్ పసాయత్

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారంలో ఉన్నటువంటి ఖజానా జాబితా తయారు చేసేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన 12 మంది సభ్యుల కమిటీ శనివారం తొలిసారి సమావేశమైంది. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ పసాయత్ చైర్మన్‌గా ఉండగా, కార్డియాలజిస్ట్ డాక్టర్ రమాకాంత్ పండా వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. 4 రోజుల ఒడిశా పర్యటనలో ఉన్న కమిటీ చైర్మన్ జస్టిస్ అరిజిత్ పసాయత్ సతీసమేతంగా జగన్నాథ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ప్యానెల్ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖజానాకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. పూరీ శ్రీజగన్నాథ మందిరం రత్న భాండాగారం జాబితా కోసం రథయాత్ర సమయం అనుకూలమైనదిగా పేర్కొన్నారు. రత్న భాండాగారం అంతర్గత ఖజానా ఎండోస్కోపీ కోసం యోచిస్తున్నారు. ప్రస్తుతానికి స్నాన పూర్ణిమ తర్వాత ఈ చర్య చేపట్టేందుకు అనుకూలమని భావిస్తున్నారు. భక్తులు లేని కారణంగా స్నాన పూర్ణిమ తర్వాత జాబితా తయారు చేయవచ్చని భావిస్తున్నామన్నారు. కానీ ఆ సమయంలో దేవతలకు సంబంధించిన అనేక రహస్య ఆచారాలు ఉన్నందున అది సాధ్యపడకపోవచ్చు. కాబట్టి కెమెరా సాయంతో కసరత్తు చేయగలిగే ఇన్వెంటరీ కోసం సాంకేతికతను ఉపయోగించడం గురించి ఆలోచిస్తున్నామన్నారు. తొలిసారిగా బ్రిటిషు పాలన సమయంలో 1926 సంవత్సరంలో రత్న భాండాగారం పరిశీలన నిర్వహించారు. రెండోసారి 1978లో జాబితా తయారు చేశారు. 1982, 1985లో రెండుసార్లు రత్న భాండాగారం నామమాత్రంగా పరిశీలించారు. ఆ తర్వాత ఇంతవరకు ఖజానా జాబితా ప్రక్రియ నోచుకోలేదు.

మహిళల హక్కుల సాధనకు పోరాటమే శరణ్యం

వజ్రపుకొత్తూరు రూరల్ : మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు పోరాటమే శరణ్యమని ఐద్వా జిల్లా నాయకురాలు బి.సుగుణవతి, శ్రామిక మహిళ నాయకురాలు ఎం.మంజుల అన్నారు. శనివారం నువ్వలరేవులో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగతికి మూలమైన మహిళల పట్ల వివక్ష చూపకుండా ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. మహిళ సాధికారత కోసం ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. పని చేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘ, ప్రజా సంఘ నాయకులు చామంతి, ఎస్.మోహన్‌రావు, ధనలక్ష్మి, బి.చామంతి, ఇందు, కమల, నిర్మల పాల్గొన్నారు.

'బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు'


మాట్లాడుతున్న గిరిజన నాయకుడు రామారావు

పాతపట్నం: బెంతు ఒరియా, వడ్డీ కులస్తులకు ఎస్టీ ధ్రువపత్రాలు జారీ చేయవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి, రంకిణి పంచాయతీ సర్పంచ్ బి.సింహాచలం కోరారు. ఈ మేరకు బెంతు ఒరియా, వడ్డీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ శనివారం పాతపట్నం కోర్టు కూడలిలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి గిరిజనులు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కోర్టు కూడలి వద్ద సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు అజారి రామారావు, జి.అప్పన్న, డోలు శ్రీను, బెహర జమ్మయ్య, తవిటినాయుడు, రాంబాబు, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌బోల్తా..ఒకరి మృతి

చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ట్రాక్టర్ బ్రేకులు ఫెయిలై వంతెన కిందకు దూసుకుపోయి బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అంతర్ల బ్రిడ్జి వద్ద శనివారం చోటు చేసుకుంది. మన్యంలో ఎన్‌హెచ్‌- 516 రహదారి నిర్మాణంలో భాగంగా విద్యుత్ పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యుత్ స్తంభాలు, సామగ్రిని పెంటపాడు నుంచి లంబసింగికి ట్రాక్టరులో తరలిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్ల బ్రిడ్జి వద్దకు రాగానే బ్రేకులు ఫెయిలై దాని కిందకి దూకుసుకుపోయి బోల్తా పడింది. దాంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం సాగరవనవంగం గ్రామానికి చెందిన పట్రాసి సంతోష్ (25) మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాహెల్, అన్వర్‌ఖాన్, జరీఫ్‌లను మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి సిఫార్సు చేశారు. స్వల్ప గాయాలైన మిగతా నలుగురిని ఇళ్లకు పంపించేశారు.

రాజీయే రాజమార్గం

పర్లాకిమిడి: పెండింగ్ కేసుల్లో రాజీయే రాజమార్గమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 2011 నుంచి పెండింగ్‌లో ఉన్నటువంటి 1,770 వివిధ కేసులు పరిష్కరించి, జరిమానా రూపంలో రూ.23,18,516లు విధించారు. అలాగే వివిధ ప్రభుత్వ బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న 1,415 డిఫాల్ట్ కేసులుకు సంబంధించి 143 పరిష్కరించారు. లోక్ అదాలత్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అధ్యక్షుడు, జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయి ప్రారంభించగా, జిల్లా న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా పర్యవేక్షించారు. జిల్లాకోర్టులో ఫ్యామిలీ కోర్టు జడ్జి సుబ్రత్ మహంతి, అదనపు జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ సామల్, ముఖ్య విచారణాధికారి నరోత్తమ శెఠి, సబ్ జడ్జి సంతోష్‌కుమార్ అగర్వాల్, సబ్ డివిజనల్ విచారణ జడ్జి విష్ణుప్రియా సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: స్థానిక సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లాలోని వివిధ కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 1,709 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా జడ్జి సత్యనారాయణ సొడంగి ఆధ్వర్యంలో కేసుల విచారణ జరిగింది. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి రీనా చౌదరి, ఫ్యామిలీ కోర్టు జడ్జి అమృత్ రంజన్ నందో, స్థాయి లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎస్ఏకే జహీరా అహ్మద్, మహిళా కోర్టు జడ్జి సోనాలి శర్మ తదితరులు పాల్గొన్నారు.


కొరాపుట్: కక్షిదారులను రాజీ చేస్తున్న న్యాయమూర్తి సంజీవ్ దుబే


రాయగడ: కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి సత్యనారాయణ సొడంగి తదితరులు


పర్లాకిమిడి: ఫ్యామిలీ కోర్టులో కేసును విచారిస్తున్న జడ్జి విష్ణుప్రియ సామంతరాయ్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టుల సముదాయంలో జిల్లా జడ్జి సంజీవ్ దుబే అధ్యక్షతన జాతీయ లోక్‌అదాలత్ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వినోద్ బిహారి సాహు, రిజిస్ట్రార్ సుకాంత్ కిషోర్ జెనా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీర బ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు


పర్లాకిమిడి: వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం


బరంపురం: హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక డైమాండ్ ట్యాంక్ రోడ్డులో నిర్వహిస్తున్న వీర బ్రహ్మేంద్ర స్వామివారి 54వ వార్షిక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ఆలయ ధర్మకర్త దంపతులు హోమం నిర్వహించి, భక్తులకు ప్రసాద సేవనం గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక పాడుగు కోవెలలో వీర బ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల కల్యాణ మహోత్సవాన్ని పర్లాకిమిడి విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూరీ జగన్నాథ ఆలయంలో నేలకు జారిన రాయి


శ్రీజగన్నాథ ఆలయ సముదాయం

భువనేశ్వర్: ప్రసిద్ధ పూరీ జగన్నాథ ఆలయ సముదాయంలో కట్టడం నుంచి శనివారం తెల్లవారుజామున రాయి పడిపోయినట్లు గుర్తించారు. దీంతో ప్రధాన ఆలయ సముదాయం ప్రాంగణంలో విమలా దేవి ఆలయానికి సమీపంలో ఉన్న మరో మందిరం దెబ్బతింది. ప్రాథమిక సమాచారం ప్రకారం తెల్లవారుజామున వరాహా ఆలయం నుంచి రాయి ముక్క పడిపోయింది. దేవాలయం ప్రధాన ఆలయానికి దక్షిణంగా విమల దేవాలయం ఎదురుగా ఉంది. ఈ ఘటనలో ఏకాదశి ఆలయ పైకప్పు దెబ్బతింది. ఆ సమయంలో అక్కడ భక్తులు ఎవరూ లేకపోవడంతో ఈ ఘటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోలేదు. నేలకు జారిన రాతి ముక్కని ఆలయ సిబ్బంది సేకరించి భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులకు సమాచారం అందించారు. శ్రీ మందిరం సముదాయంలో దక్షిణ గృహంతో పరిసరాల్లో మరమ్మతు పనులను ఏఎస్ఐ ఇటీవల పూర్తి చేసింది. ఇంతలో ఈ పరిసరాల్లో ఆలయం నుంచి రాతి ముక్క నేలకు జారడం కలకలం రేపింది. ఈ ఘటన వెనుక ఖచ్చితమైన కారణం స్పష్టం కావాల్సి ఉంది. కోతులు ఒకవైపు నుంచి మరో వైపుకు దూకేందుకు ప్రయత్నించే క్రమంలో వదులుగా ఉన్న రాయి ముక్క పడిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఏఎస్ఐ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించినా శ్రీ జగన్నాథ ఆలయ అధికార వర్గం (ఎస్‌జేటీఏ) ఈ సంఘటనపై స్పందించ లేదు. లోగడ 2011 సంవత్సరంలో జగన్నాథ దేవాలయం పశ్చిమ ద్వారం గోపురం నుంచి ఒక టన్ను బరువు ఉన్న రాయి జారి పడింది.

అంకులిలో ట్రక్ బోల్తా


బోల్తాపడిన ట్రక్ వద్ద గుమిగూడిన జనం

- డ్రైవర్ మృతి

బరంపురం: నగర శివారులోని 16వ నంబర్ జాతీయ రహదారి అంకులి బైపాస్‌లో ట్రక్ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. తీవ్రగాయలతో ఉన్న క్లీనర్‌ని అస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో బీఎస్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి అంకులి బైపాస్ వద్ద ట్రక్ అదుపు తప్పి గోతిలో పడిపోయింది. ఈ సంఘటనలో గంజాం జిల్లా పులసరకి చెందిన డ్రైవర్ హరినాథ్ బెహర అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూజీ, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్

- 17 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం


మంత్రి మండలి తీర్మానాలు వివరిస్తున్న మంత్రి సుదాం మరాండి

భువనేశ్వర్: నగరంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం శనివారం జరిగింది. దీనిలో భాగంగా వివిధ శాఖలకు చెందిన 17 ప్రతిపాదనలపై చర్చించి మంత్రి మండలి అన్నింటినీ ఆమోదించింది. సమావేశం ముగిసిన తర్వాత మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రెవెన్యూ, పాఠశాల, సామూహిక విద్యాశాఖ మంత్రి సుదామ్ మరాండి, ఉన్నత విద్య, సహకార శాఖ మంత్రి అతున్ సవ్యసాచి నాయక్, అభివృద్ధి కమిషనర్ కమ్ అదనపు ప్రముఖ కార్యదర్శి అనూ గర్గ్ వివరించారు. రాష్ట్రంలో అన్నివర్గాల యూజీ (గ్రాడ్యుయేట్), పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేట్) విద్యార్థులందరికీ కొత్తగా స్కాలర్‌షిప్ అందజేయాలని మంత్రి మండలి తీర్మానించింది. గతంలో ఈ సౌలభ్యం ఉన్నత విద్యాశాఖ పరిధిలోని యూజీ, పీజీ విద్యార్థులకు మాత్రమే పరిమితం. మంత్రి మండలి తాజా తీర్మానం ప్రకారం ఇతర శాఖలు వ్యవసాయం, సాంస్కృతిక శాఖ అధీనంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం విస్తరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక ఉపాధ్యాయుల వేతనాలను సవరించింది. దీనివల్ల 1,04,000 మందికి పైగా ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.587 కోట్లు వెచ్చించనుంది. ఎలిమెంటరీ టీచర్ల కేడర్ పునర్వ్యవస్థీకరించబడుతుంది. అదేవిధంగా రాష్ట్రంలో కొత్త విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో కొత్త గమ్యస్థానాలకు విమాన సర్వీసులు ప్రారంభమవుతున్నాయి. ఈ ప్రాంతంలో విమానయానం మాత్రమే కాకుండా భద్రతను కూడా నిర్ధారించడానికి బిజూ పట్నాయక్ ఏవియేషన్ సెంటర్‌ను ఢెంకనాల్ బిరాషల్‌లో ఏర్పాటు చేస్తారు. ఇక్కడ విమానయానానికి సంబంధించిన ప్రతి భాగస్వామ్య శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది తదితరులకు వివిధ రకాల శిక్షణలు ఇస్తారు. విమానయాన కేంద్రం కోసం రూ.562 కోట్లు ఖర్చు చేయనున్నారు. మరోవైపు 318 సంయుక్త బస్ స్టేషన్లకు రూ.6 వేల కోట్లు మంజూరయ్యాయి.

మునిగుడలో గంజాయి స్వాధీనం


గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఏడుగురు నిందితులను మునిగుడ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 110.300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు రూ.18,940 నగదు, మరో 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టుకు తరలించారు. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు మునిగుడ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మునిగుడ రైల్వేస్టేషన్ ఎదుట అనుమానస్పదంగా తిరుగుతున్న ఏడుగురు యువకులను పట్టుకుని ప్రశ్నించారు. దీంతో వారి దగ్గర గంజాయి పట్టుబడింది. నిందితులు ఈ గంజాయిని రైలులో తరలించేందుకు సిద్ధమవుతుండగా పట్టుబడ్డారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

మేక్ ఇన్ పాలిటెక్నిక్


పోర్జింగ్ శిక్షణలో విద్యార్థులు


కర్రను కట్ చేస్తున్న విద్యార్థులు

- శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్
- మార్కెట్ కంటే నాణ్యమైన, తక్కువ ధరకు ఫర్నిచర్ సరఫరా
- తయారీలో పట్టు సాధిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: జీవితంలో స్థిరపడాలంటే విద్యతో పాటు నైపుణ్యం అవసరం. కేవలం అకడమిక్ చదువుతోనే సరిపెట్టకుండా సంబంధిత కోర్సుల్లో పూర్తిస్థాయి విషయ పరిజ్ఞానం, ప్రయోగ విజ్ఞానంపై పట్టుత సాధించాలి. అలాంటప్పుడే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలం. ఇదే ఆలోచనతో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. మెకానికల్ డిప్లమో విద్యార్థులకు తయారీ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 180 మంది విద్యార్థులకు ఉదయం క్లాస్ వర్కు, మధ్యాహ్నం వర్కు షాపుల్లో ప్రయోగాలకు ప్రాధాన్యమిస్తున్నారు.

ఆర్డర్లు సైతం స్వీకరణ..

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1966లో ఏర్పాటైంది. మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 1970 నుంచి ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్‌ నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్‌లో ఆర్డర్లు ఆధారంగా ఫర్నిచర్ తయారు చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల నుంచి ముందుగా ఆర్డర్లు స్వీకరిస్తారు. అనంతరం మెటీరియల్ టెండర్ తీసుకొని ఆర్డర్ డెలివరీ చేస్తారు. ఇప్పటికే జిల్లా కలెక్టరేట్, డ్వామా కార్యాలయంతో పాటు పలు కార్యాలయాలు, కళాశాలలకు ఆర్డర్లు అందజేశారు. నాణ్యతలో ఏ మాత్రం రాజీపడకుండా బ్రాండెడ్ కంటే తక్కువ ధరకు బీరువాలు, కంప్యూటర్ టేబుల్స్, బెంచీలు, లైబ్రరీ, విద్యా సంస్థల రాక్‌లు, స్టూడెంట్ డెస్కులు, హాస్టల్ మంచాలు, ప్రాక్టికల్ బెంచీలు, స్టూల్స్ వంటి అనేక మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఆదాయం అదుర్స్..

2022–23 ఏడాదిలో రూ. 5.89 లక్షలు ఆర్డర్లకు రూ.41 వేలు ఆదాయం వచ్చింది. 2023–24 ఏడాదికి ఇప్పటివరకు రూ. 19.65 లక్షల ఆర్డర్లుకు రూ.75వేలు ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కళాశాల అభివృద్ధికి ఖర్చుచేస్తారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అన్ని రకాల ఫర్నిచర్ తయారీపై పట్టుసాధించారు. కనీసం ఏడాదికి రూ.లక్ష ఆదాయం లక్ష్యంగా ఈ కేంద్రం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యా కల్పన ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

పనిపై పట్టు..



మెకానికల్ డిప్లమా మూడేళ్ల కోర్సులో భాగంగా వర్కు షాపుల్లో నిరంతరం సాధన చేస్తాం. ప్రయోగాత్మకంగా ఫర్నిచర్, బీరువాలు వంటివి తయారు చేస్తాం. ఐరన్, కలప ఫర్నిచర్‌లు తయారీ వల్ల స్కిల్స్ సాధ్యమవుతాయి. నేర్చుకున్న పని పారిశ్రామిక అవసరాలకు, వృత్తి నైపుణ్యానికి ఉపయోగపడుతుంది.

– వై.వినయ్‌కుమార్, మెకానికల్, డిప్లమా విద్యార్థి.

బృందాలుగా..



విద్యార్థులంతా బృందాలుగా విడిపోయి పనిచేస్తాం. సాధన వల్ల నాణ్యమైన ఫర్నిచర్ తయారు చేస్తాం. డిప్లమా విద్యార్థులకు అంటే స్కిల్ వర్క్, థియరీలో పూర్తి స్థాయి విషయ పరిజ్ఞానం ఉంటుంది. ప్రయోగాల వల్ల అన్ని రకాల స్కిల్స్ నేర్చుకోవచ్చు.

– సువ్వారి నాగలక్ష్మి, మెకానికల్ డిప్లమా విద్యార్థిని.

మార్కెట్ కంటే తక్కువ ధర..

ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆర్డర్లపై మాత్రమే ఫర్నిచర్ తయారు చేస్తాం. నాణ్యత, పరిమాణం పక్కాగా ఉంటుంది. బయట సంస్థలతో పోల్చితే 10 శాతం వరకు ధర తగ్గుతుంది. ప్రభుత్వ సంస్థలకు మాత్రమే ఆర్డర్లపై సరఫరా చేస్తాం.

– బి.రవికుమార్, ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి, సీనియర్ లెక్చరర్

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గీతా యజ్ఞం


శ్రీకృష్ణ విశ్వశాంతి గీతా మహాయజ్ఞం చేస్తున్న వేద పండితులు

పార్వతీపురం టౌన్: మండలంలోని చినబొండపల్లిలోని ఈశ్వరీ మహాదేవి పీఠంలో భక్తిశ్రద్ధలతో గీతాయజ్ఞం నిర్వహిస్తున్నారు. 40 రోజుల పాటు భగవద్గీతలోని 18 అధ్యాయాలను పఠిస్తూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ప్రపంచమంతా శాంతియుతం కావాలన్న సత్సంకల్పంతో యజ్ఞం నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి సద్గురు శ్రీనివాసస్వామి తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు యజ్ఞం కొనసాగుతుందన్నారు. 24న శ్రీకృష్ణ విశ్వశాంతి కల్యాణం, అన్నసమారాధ జరుగుతుందని తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభను విజయవంతం చేయండి

గజపతినగరం: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూసర్ల పట్టాభి పిలుపునిచ్చారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని విలేకరులతో శనివారం మాట్లాడిన ఆయన దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం కల్యాణ మండపంలో ఈ నెల 10వ తేదీన జరగనున్న సభకు ఆర్యవైశ్యులంతా తరలిరావాలన్నారు. బైక్‌లు, కార్ల ద్వారా గజపతినగరం పెట్రోలుబంకు దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి ర్యాలీగా దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం కల్యాణ మండపం చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యుల ఐక్యత, అభివృద్ధి తదితర అంశాలపై చర్చించుకుంటామన్నారు.

అందరికీ సమాన అవకాశాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు జయసుమ, విజయ, తదితరులు

డెంకాడ: సమాజంలో స్త్రీ, పురుషులిద్దరికీ సమాన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు మహిళలను ప్రోత్సహించాలని జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించితే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గౌరవ అతిథి విశాఖ ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్-జి ఎం.విజయ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు ఎదుర్కొంటున్న వివక్షను వివరించారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, టెడ్‌టాక్, డ్యాన్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, అధ్యాపకురాలు ప్రభ, మహిళా కోఆర్డినేటర్లు, మహిళా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆట పరికరాలు


ఎస్.కె.పాడు అడ్వంచర్ పార్కులో చిన్నారుల కోసం ఏర్పాటు చేస్తున్న ఆట పరికరాలు

గుమ్మలక్ష్మీపురం: పర్యాటకాభివృద్ధి పనుల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్.కె.పాడు హెచ్ఎన్‌టీసీలో రూ.1.5 కోట్లతో అడ్వంచర్ పార్కును ముస్తాబు చేస్తున్నారు. దీనిలో చిన్నారుల ఆటవిడుపునకు వీలుగా జారుడు బల్లలు, ఊయలలు, రాట్నం తదితరవి అమర్చుతున్నారు. ఇవి మరికొద్ది రోజుల్లో చిన్నారులకు అందుబాటులోకి వస్తాయని భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు.


మాతాశిశు సంక్షేమానికి ‘ప్రిజమ్’


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, వైద్యాధికారి తేజ్‌రతన్‌రాజ్

పాలకొండ రూరల్: మాతాశిశు సంక్షేమమే లక్ష్యంగా ప్రిజమ్-10ను అమలుచేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. పాలకొండ నీలమ్మకాలనీలోని యూపీహెచ్‌సీని ఆయన శనివారం సందర్శించారు. గర్భిణులకు నెలనెలా వైద్యపరీక్షలు చేయాలని, అవసరమైన మందులు అందజేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ఆకుకూరలు, పండ్లతో పాటు ఐరన్ సిరప్, బెల్లం పదార్థాలు తీసుకొనేలా చూడాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ కె.తేజ్‌రతన్‌రాజ్ పాల్గొన్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

- జ్ఞానేంద్రియాల్లో నేత్రాలు అత్యంత ప్రధానమైనవి
- మారిన ఆహారపు అలవాట్లతో గ్లకోమా బారిన ప్రజలు
- క్రమక్రమంగా చూపును కోల్పోతున్న జనం
- కళ్లు లేని జీవితం బాధాకరం
- నేటి నుంచి ప్రపంచ గ్లకోమా వ్యాధి వారోత్సవాలు



గ్లకోమా రాకముందు, వచ్చిన తర్వాత నేత్రమిలా..

పార్వతీపురంటౌన్: మనిషి దేహంలో కళ్లే అత్యంత ప్రధానమైనవి. అందుకే సర్వేంద్రియానాం నయనం(కన్ను) ప్రధానం అన్నారు పెద్దలు. మన ఊహలను బంధించి, అపురూపమైన అనుభవాలను మనకు మిగిల్చేలా చేసే కళ్లు లేకపోతే జీవితాంతం చీకటిలో ఉండాలి. పుట్టుకతో కళ్లు లేకుంటే అది పూర్తిగా చీకటి ప్రపంచమే. ఇదిలా ఉంటే కంటి జబ్బులతో చాలామంది చూపు కోల్పోతున్నారు. అది ఇంకా నరకం. కొంతకాలం వెలుగుల ప్రపంచాన్ని చూశాక.. ఆ తర్వాత అదే చీకటి అయితే మనిషి ఆ బాధను భరించడం చాలాకష్టం. కళ్లను నిత్యం కాపాడుకునేందుకు శ్రమించడం, అవే కళ్లు ఎటువంటి వ్యాధులకు గురికాకుండా శ్రద్ధ తీసుకోవడం, ప్రతీ 6 నెలలకు నేత్రవైద్యులను సంప్రదించి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. ఇప్పుడు మారిన ఆహారపు అలవాట్లతో చాలామంది రక్తపోటుకు గురవుతున్నారు. దీని కారణంగా గ్లూకోమా(నీటికాసులు వ్యాధి) బారినపడి కంటి చూపును కోల్పోతున్న సందర్భాలు అధికం. ఈ నేపథ్యంలో గ్లకోమా నివారణే లక్ష్యంగా ఆదివారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు వారోత్సవాలు చేపట్టి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను వైద్యసిబ్బంది అప్రమత్తం చేయనున్నారు.

గ్లకోమా అంటే..

గ్లకోమా(నీటికాసులు) అనేది కళ్లకి సంబంధించిన ఒక వ్యాధి. కంటి యొక్క డ్రైనేజ్ నిర్మాణాలు సరిగ్గా పనిచేయకపోవడం కారణంగా కంటి లోపల పీడనం పెరిగి ఆప్టిక్ నరానికి హాని కలిగిస్తుంది. గ్లకోమా ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించకపోయినా కాలక్రమేణా చూపును కోల్పోవచ్చు. ఈ వ్యాధి బారినపడిన చాలామందికి వ్యాధి వచ్చినట్లు కూడా తెలియదు. దీనిని ముందుగా గమనించకపోయినా, చికిత్స చేయించుకోకపోయినా శాశ్వతంగా చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ వ్యాధిని కంటి ఒత్తిడిని పరీక్షించడం ద్వారా గుర్తించవచ్చు. ఈ ప్రక్రియనే ‘ఇంట్రా ఆక్యులర్ ప్రెషర్’ అంటారు. ఆరోగ్యకరమైన కన్ను అక్వియస్ అనే ద్రవపదార్థాన్ని ఉత్పత్తి చేస్తుంది. అదే స్థాయిలో డ్రైన్ చేస్తుంది. ఈ డ్రైనేజ్ ప్రక్రియను అడ్డుకోబడినప్పుడు అధిక ఒత్తిడి వచ్చి, ద్రవం సాధారణ స్థాయిలో బయటకు వెళ్లదు. దీనిద్వారా పెరిగిన ఒత్తిడి ఆప్టిక్ నరానికి ఎదురుగా తోస్తుంది. తద్వారా కన్నుకి నష్టం కలిగే అవకాశం ఉంది. దీనివల్ల క్రమక్రమంగా కంటి చూపును కోల్పోతాం.


గ్లకోమా వారోత్సవాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

అందుబాటులో ఉచితంగా చికిత్స..



గ్లకోమా వ్యాధికి ఉచిత చికిత్స అందుబాటులో ఉంది. ప్రస్తుతం జిల్లాలో జరిగే గ్లకోమా వారోత్సవాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా నేత్ర పరీక్షలు చేయడం జరుగుతుంది. ఎవరైనా గ్లకోమా లక్షణాలతో బాధపడితే వారికి ఆస్పత్రుల్లో చికిత్స అందించడం జరుగుతోంది.

– డా జీరు నగేష్‌రెడ్డి, నేత్ర వైద్యాధికారి, జిల్లా కంటి వెలుగు సెల్

వ్యాధి ఎవరికి వస్తుంది..

- వంశపారంపర్యంగా వస్తుంది(కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉంటే వారి వారసులకు).
- మధుమేహ వ్యాధి ఉన్న వారికి
- బీపీ(రక్తపోటు) ఉన్న వారికి
- దీర్ఘకాలంగా స్టెరాయిడ్స్ వాడుతున్న వారికి
- ప్రమాదాల్లో కంటికి గాయమైనప్పుడు

వ్యాధిని ఎలా గుర్తించవచ్చు..

గ్లకోమా వ్యాధిని కనుక్కోవడానికి నేత్రవైద్యుడితో పూర్తి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. సంపూర్ణ కంటి పరీక్షలో కంటి ఒత్తిడి(ఐవోపీ) కొలత, కంటి డ్రైనేజ్ ప్రక్రియ, ఆప్టిక్ నరాన్ని పరీక్షించడం, కంటి విజువల్ ఫీల్డ్ పరీక్షల ద్వారా కంటి చూపును పరిశీలించి, గ్లకోమాను గుర్తిస్తారు.

జాగ్రత్తలు పాటించాలి..



కంటికాసుల వ్యాధి(గ్లకోమా)తో బాధపడుతున్న వారంతా తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా కంటి వైద్య నిపుణులను సంప్రదించి, వారి సూచనల మేరకు చికిత్స చేయించుకోవాలి. వీలైనంత వరకు జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి ప్రమాదం ఉండదు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స కూడా అందుతోంది. – డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి.

నిర్లక్ష్యం చేయొద్దు..



గ్లకోమా లక్షణాలతో ఎవరైనా బాధపడినట్లు అయితే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న నేత్ర వైద్య విభాగాన్ని సంప్రదిస్తే, ఉచితంగా చికిత్స, సలహాలు, సూచనలు అందిస్తాం. వ్యాధి వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా చికిత్స పొంది, కంటి చూపును కాపాడుకోవాలి.

– డాక్టర్ సుకుమార్‌బాబు, నేత్రవైద్య నిపుణులు, జిల్లా ఆస్పత్రి.

ఒత్తిడి తగ్గించడమే చికిత్స..

గ్లకోమా వ్యాధి వచ్చినట్లు గుర్తించిన వెంటనే కంటి ఒత్తిడిని తగ్గించడమే దీనికి ప్రధానమైన చికిత్స. దీర్ఘకాలిక నియంత్రణ ఇచ్చే కంటిచుక్కల మందు, మాత్రలు వాడకం చాలా ముఖ్యం. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స కూడా చేయాల్సి వస్తుంది. క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలి. గ్లకోమాను ముందుగా పసిగడితే వైద్యం ద్వారా కళ్లను కాపాడుకోవచ్చని కంటి వెలుగు నేత్ర వైద్యాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా అంతటా ప్రత్యేక గ్లకోమా అవగాహన సదస్సులు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు.

ఉప్పొంగిన భక్తి

- శివనామస్మరణతో మారుమోగిన గుంప
- నాగవళి-జాంఝావతి నదీ సంగమంలో పుణ్య స్నానాలు

కొమరాడ: నాగావళి-జంఝావతి నదీ సంగమం వద్ద కొలువుదీరిన గుంప సోమేశ్వరుడి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నలుమూలలు నుంచే కాక శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివరాత్రి పర్వదినాన శుక్రవారం నాగావళి నదీ తీరంలోని ఇసుక తిన్నెలపై టెంట్లువేసుకుని జాగరణ చేశారు. శనివారం వేకువజామున నదీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి సోమేశ్వరుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. పూజా ఏర్పాట్లను దేవదాయశాఖ ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.


పూజలందుకుంటున్న గుంపసోమేశ్వరుడు

ఉచితంగా విద్యుత్

విజయనగరం టౌన్:

భారతదేశంలోని కోటి కుటుంబాల్లో ఉచిత విద్యుత్ కాంతులు నింపేందుకు ప్రధానిమోదీ సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అందుబాటులోకి తెచ్చారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. 300 యూనిట్లు లోపు విద్యుత్ బిల్లులు చెల్లించలేని పేదలను గుర్తించేలా పోస్టుమన్‌లకు అవగాహన కల్పించాలని హెడ్‌పోస్టాఫీస్‌లో పోస్ట్‌మాస్టర్‌కు శనివారం విజ్ఞప్తి చేశారు. ఉచిత విద్యుత్ కోసం 2024-2025 బడ్జెట్‌లో రూ.75వేల కోట్లను కేటాయించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమంచి సుబ్బారావు, అశోక్, సుధీర్, జగ్గారావు, కంది సీతారామ్, సోము మహేష్, మజ్జి రాంబాబు, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొటియా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

సాలూరు: ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూపు గ్రామాల్లో సాధారణ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు ఈఆర్‌ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒడిశా కలెక్టర్‌తో మాట్లాడారన్నారు. సాలూరు తహసీల్దార్ కార్యాలయాన్ని పీఓ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో వివాదాస్పద పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ ఎన్నికలు సజావుగా జరిపేందుకు ముందస్తు చర్యలు చేపట్టామని చెప్పారు. కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఎన్నికల నామినేషన్ సమయంలో అభ్యర్థితో పాటు కేవలం నలుగురు వ్యక్తులనే నామినేషన్ వేసేందుకు ఆర్‌ఓ కార్యాలయంలోకి అనుమతిస్తామని చెప్పారు. సాలూరు తహసీల్దార్ కార్యాలయం మీద ఉన్న ప్రత్యేక గదిని ఆర్‌ఓ కార్యాలయంగా గుర్తించామన్నారు. సాలూరు తహసీల్దార్ కార్యాలయంలో పీఓను సీపీఎం నాయకులు ఎన్.వై.నాయుడు, శ్రీనివాసరావు కలిశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై పీఓ స్పందిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఏఎన్‌ఎమ్ ఉన్న ప్రాంతంలోని ఐటీడీఏ ఏఎన్ఎంను ఆశ్రమ పాఠశాలల్లో నియమించే కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే జరుగుతోందని వివరించారు. దీనిపై సీపీఎం నాయకులు సంతోషం వ్యక్తంచేశారు.


ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పూత భలే..

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి పూత, పిందె ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. ప్రకృతి అనుకూలిస్తే అధిక ఆదాయం వస్తుందని గిరిజనులు ఆశిస్తున్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ 1980-90 దశాబ్దంలో ఈ ప్రాంతంలో జీడిమొక్కల పెంపకాన్ని ప్రోత్సహించింది. ‘జీడి మొక్కలు నాటు.. దారిద్ర్యానికి కాటు’ అన్న నినాదంలో గిరిజన రైతులకు జీడిమామిడి సాగుపై మక్కువ పెంచింది. తొలుత గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఆరంభమైన సాగు తర్వాత జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, సాలూరు తదితర సబ్‌ప్లాన్ ఏరియాల్లో విస్తరించింది. ఇప్పుడు గిరిజన రైతుకు మంచి ఆదాయవనరుగా మారింది. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన రైతులకు జీడిమొక్కలను ఉచితంగా అందజేయడంతో పాటు సాగుఖర్చులకు ఉపాధిహామీ నిధులను వెచ్చిస్తుండడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పూత, పిందెదశలోని జీడి పంట సస్యరక్షణలో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు.


తోలుఖర్జ గ్రామంలో పిందె దశలో ఉన్న జీడిపంట

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ డిప్యూటీ డైరెక్టర్ మనోరంజని

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ డిప్యూటీ డైరెక్టర్ మనోరంజని సూచించారు. నగరంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతిరోజూ పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని, అలా అయితేనే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా పుడతారన్నారు. స్థానికంగా దొరికే మునగ ఆకు కూడా ఆరోగ్యానికి మంచిదేనని, రక్తహీనత కూడా రాదన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను సద్వినియోగం చేసుకోవాలని, కుక్కర్‌లో అన్నం వండుకుని, తినాలన్నారు. గంజి కూడా పారవేయకుండా తాగాలన్నారు. వీటితో పాటు రాగిపిండి, అటుకులు, ఖర్జూరం, వేరుశనగ చెక్కీలు తినాలన్నారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన ప్రతీ బిడ్డకు అదనపు పౌష్టికాహారాన్ని ద్రవ రూపంలో గానీ, గుజ్జు రూపంలో గానీ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం కూడా తినాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బి.అనురాధ, జానకి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుర్ల: మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నేతలు కె.వి సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన వారు తెట్టంగిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైతే ఆ ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న 14 గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఉపయోగకరమన్నారు. కళాశాల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లకు ధన్యావాదాలు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూదనరావు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి


గిరిజన సంప్రదాయ కళాపుస్తకాన్ని జ్ఞాపికగా అందజేస్తున్న వీసీ కట్టిమణి

- కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి

విజయనగరం అర్బన్: మహిళలు స్వశక్తితో ఎదగాలని, ఆ విధంగా తమను తాము మలచుకోవాలని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన యూనివర్సిటీలో వసుదైక కుటుంబం అనే అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ధైర్యసాహసాలు అలవర్చుకోవాలని, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందడుగు వేసి, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలని మహిళలకు తెలిపారు. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఇదే సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఒడిశాలోని బరంపురం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ మాట్లాడుతూ మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత వంటివి పుష్కలంగా లభించినప్పుడే పురుషులతో సమానంగా వారు ఎదగగలుగుతారన్నారు. స్త్రీలపై చూపిస్తున్న వివక్ష, జరుగుతున్న వేధింపులు, లైంగిక దాడులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గిరిజన విద్యార్థుల సంప్రదాయ కళల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఆ తర్వాత కార్యక్రమ ముఖ్య అతిథికి గిరిజన సంప్రదాయ కళాపుస్తకాన్ని జ్ఞాపికగా వీసీ ప్రొఫెసర్ కట్టిమణి అందజేశారు. కార్యక్రమంలో ఉమెన్స్ సెల్ చైర్‌పర్సన్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, డాక్టర్ కుసుమ, డాక్టర్ ప్రేమ చటర్జీ, డాక్టర్ దివ్య కొనికల్, డాక్టర్ లత కల్యంపూడి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు


ప్రత్యేకాలంకరణలో ఉమాసదాశివుడు


శృంగవరపుకోట: మెట్ల మార్గంలో పుణ్యగిరికి తరలివెళ్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో చేపట్టిన మహాశివరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ వేడుకల్లో దాదాపు రెండు లక్షలకు పైగా భక్తులు శివకేశవులను దర్శించుకున్నట్లు ఆలయ అధికారుల అంచనా. ఆలయ ప్రాంగణం, కల్యాణ మండపం, బోడికొండ ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. నీలాచలం బోడికొండ, రామస్వామి ఆలయం, కోనేరు గట్టు ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందురోజు రాత్రంతా జాగారాలు చేసి, ఉదయాన్నే కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సీతారామస్వామిని, ఉమాసదాశివ స్వాముల వారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఉమాసదాశివాలయంలో లింగోద్భవ పూజలు జరగ్గా, ఆ సమయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటీపడ్డారు. భోగాపురం, పూసపాటిరేగ, లావేరు, రణస్థలం, భీమిలి, విశాఖపట్నం తదితర ప్రాంతాల మత్స్యకారులు వృత్తంలా ఏర్పడి, వారి మధ్యలో స్వామి ప్రతిమ ఉంచి, సంప్రదాయ నృత్యాలు చేశారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గస్తీ చేపట్టారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ఎస్ఐ రామగణేష్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమరాలతో భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ అల్లరిమూకల ఆగడాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఉత్సవాలు విజయవంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, మిమ్స్, నతివాడ, కొండవెలగాడ పీహెచ్‌సీల సిబ్బంది భక్తులకు తమవంతు సహాయ సహకారాలు అందించారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి సురేష్ బాబు, ఈవో శ్రీనివాసరావు, తదితరులు ఉత్సవాల నిర్వహణను దగ్గరుండి పర్యవేక్షించారు.

పుణ్యగిరిలో జనసిరి..

శృంగవరపుకోట: మహాశివరాత్రి వేళ జాగరణ చేసిన భక్తులంతా ముక్కంటీశ్వరుని దర్శనం కోసం పుణ్యగిరికి శనివారం బారులుతీరారు. ఉదయం నుంచి ప్రారంభమైన దర్శనాలు రాత్రి వరకు కొనసాగాయి. తూర్పుగోదావరి, విశాఖ, శ్రీకాకుళం, ఒడిశాలోని పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుట్టుదార, దారగంగమ్మ లోయల వద్ద పుణ్యస్నానాల కోసం భక్తులు పోటీపడ్డారు. పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ సరఫరా చేసి, భక్తుల దాహార్తిని తీర్చారు.